25022024-DIS-04_Layout 1 2/25/2024 3:20 AM Page 1

చెలిమె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com

అరవై ఏండ్ల కిందట ఒక బతుకుపాదులో అంటరాని అక్షరం పురుడు పోసుకుంది. చిరుప్రాయంలోనే తండ్రిని కోల్పోయి, ఆ అక్షరం విలవిలలాడింది. అక్షరం చుట్టూ ముసురుకున్న చీకట్లు. మాతృమూర్తి మహాసంకల్పంతో అడ్డంకులను లెక్కచేయకుండా, అన్నీ తానై అక్షరాన్ని లాలించింది. ముండ్లదారిలో ముందుకు దూసుకుపోయే గుండె నిబ్బరాన్ని నేర్పింది. నిరంతర కృషితో, తల్లి చల్లని దీవెనలతో అక్షరం కాస్తా పదమై పరిమళించింది. మొక్కవోని సంకల్పంతో ఆ పదం వాక్యమై, దేశికోత్తముల ఆశీస్సులతో తెలుగు కవితై, ప్రాదేశిక సృజనోత్తేజంతో తెలంగాణ కావ్యమై తేజరిల్లింది.

నిత్య స్ఫూర్తిదాయకమైన ఆ జీవనకావ్యం పేరు ఆచార్య బన్న అయిలయ్య. రంగంపేట మాలపల్లి నుంచి బయలుదేరి చెక్కుచెదరని ఆత్మవిశ్వాసంతో, ఉన్నత విద్యా శోధనతో కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల పీఠాన్ని అధిరోహించిన ధీశాలి బన్న అయిలయ్య. ఆచార్యునిగా, ప్రాచార్యునిగా, పీఠాధిపతిగా, కవిగా, విమర్శకునిగా, పరిశోధకునిగా, సంపాదకునిగా, బహుముఖీన ప్రతిభా సంపత్తితో సాగిన అయిలయ్య జీవన, సాహిత్య ప్రస్థానం ఎందరికో ఆదర్శం.

నిత్య సాహిత్యస్ఫూర్తి ఆచార్య బన్న అయిలయ్య

నిరుపేద కుటుంబంలో పుట్టిన అయిలయ్య ప్రతిష్ఠాత్మకమైన కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షుడిగా సమున్నత స్థాయికి చేరుకోవడం వెనుక కఠోరమైన కృషి, దీక్షాదక్షతలు ఉన్నాయి. చెమట చుక్కలతో, కన్నీళ్లతో తడిసిన సంఘర్షణాత్మకమైన బాల్యం ఆయనది. తరగతి గదిలో విద్యార్థిగా, తరగతి బయట శ్రమజీవిగా అయిలయ్య ద్విపాత్రాభినయం చేశారు.

కూలీపనులకు వెళ్తూ, దుకాణాల్లో పనిచేస్తూనే నర్సంపేటలో ఇంటర్ డిగ్రీ, చదువుకొని ఉన్నత విద్యావంతుడయ్యారు అయిలయ్య. విద్యార్థి ఉద్యమాలతో మమేకమై విప్లవ రాజకీయాల వైపు మళ్లారు. ఒక మహావృక్షం తాను మొలకెత్తిన ప్రాంగణానికే నీడ నిచ్చినట్టు అయిలయ్య తాను పరిశోధన చేసిన కాకతీయ విశ్వవిద్యాలయంలోనే అధ్యాపకుడై ఎంతో మంది విద్యార్థులకు భాషాసాహిత్యాలను బోధించారు. ఉత్తమోత్తమ గురువులకు శిష్యుడై, సత్ శిష్య కోటికి గురువయ్యారు.

మూడున్నర దశాబ్దాల పాటు భాషా సాహిత్యాల బోధనలో, పరిశోధనలో నిబద్ధతతో నిమగ్నమయ్యారు. పరిశోధక విద్యార్థులను ప్రాణమిత్రులుగా భావించి ఆదరించారు. విశ్వవిద్యాలయ ఆచార్యులకు కొంగుబంగారంగా, అధికారులకు తలలో నాలుకలా విలసిల్లారు. చాలావరకు సంప్రదాయ సాహిత్య పరిశోధనలకు, ఆ విలువలకు ఆలవాలమైన కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో ఆచార్య కాత్యాయిని విద్మహే ఆధునిక దృష్టిని కలిగించినట్టుగా, అస్తిత్వ ఉద్యమాల సాహిత్య పరిశోధనలకు, తదనుగుణమైన పాఠ్య ప్రణాళికకు అయిలయ్య పెద్దపీట వేశారు. దళిత, బహుజన, తెలంగాణ ఉద్యమ దృక్పథంతో సాహిత్యాన్ని మూల్యాంకనం చేసే తాజా పరిశోధనా పద్ధతులను విద్యార్థులకు బోధించారు. ప్రజాస్వామ్య బద్ధమైన ఉద్యమాల జాడలో సామాజిక, సాహిత్య కార్యకర్తగా తన వంతు పాత్రను పోషించారు. ఉత్తమ గురువుగానే కాకుండా ప్రభావశీలమైన కవిగా ఆయన విమర్శకుల మెప్పు పొందారు.

> 'నేను నడిచి వచ్చిన పాదాల గుర్తుల్ని మనసు పొరల కింద దాచుకొని, అర్ధరాత్రి బరువుగా తోస్తే నా కండ్లు చెమ్మగిల్లేవి/నాకలం వర్షించేది' అని అయిలయ్య సహజ సిద్ధమైన తన సృజనస్ఫూర్తిని తెలియజేశారు. 'కన్నీరు కలదేని ఎన్నయినా ఉన్నట్లే' అని కాళోజీ అన్నట్టుగా అక్షరధనమే అపూర్వ పెట్టుబడిగా అయిలయ్య అరుదైన కవితాసంపదలను పండించారు.

చెమ్మగిల్లిన కన్నులతో జీవితాన్ని, సమాజాన్ని తాత్త్వికంగా వ్యాఖ్యానిస్తూ అయిలయ్య వెలువరించిన 'రహస్య చిత్రం' కవితా సంపుటి విలక్షణమైనది. 'రహస్య చిత్రం'లో కవి అద్భుత కవితా శిల్పాన్ని ఆవిష్కరించారు. 'మనిషి చెట్టుకు పూసిన పూలు కన్నీళ్లయితే/ ఆ పూలన్నీ పండుగా మారితే అది గుండె' అంటూ సమాజ ఉనికికి మూలసూత్రమైన మానవీయ స్పృహకు అయిలయ్య పరమ ఆర్ద్రంగా కవితా భాష్యం చెప్పారు. 80వ దశకంలో పెరిగిన నిర్బంధాలను, క్రూరమైన రాజ్య హింసను ధిక్కరించి, ప్రతిఘటనాత్మక చైతన్యాన్ని శక్తివంతంగా కవిత్వీకరించారు. 'వెదురు పొదల మాటున తెగిపడ్డ పిడికిళ్లు / వేళ్లూనుకొని తుపాకులై మొలవాలి/ పోలీసు వాహనాల కింద పగిలిన గుండెలు మళ్లీ కొట్టుకోవాలి' అని రాజ్యం అధికారికంగా సాగించే మారణకాండను నిరసించారు. 'కలాల నాలుకలను తెగ్గోసి/జైలు ద్వారాలకు తోరణాలుగా వేలాడ దీస్తారు' అని అయిలయ్య 30 ఏండ్ల కిందట చెప్పిన మాట ఈనాటి స్థితిగతులను గుర్తుచేస్తుంది. 'దిక్కులేక దీనంగా రోడ్డు శిలువకు /బిగించిన బాల క్రీస్తులు/ చీకటి దుప్పటిని కప్పుకొని ఉన్నారు; 'పయోలిన్ గొంతుకు/ నీ కర్ణ భేరిని అతికించు/ గతం తలపోస్తున్న ఆలాపన విను'; 'తుంచిన పారాసెటమాల్ మాత్రలా చంద్రుడు'... ఇలాంటి అసాధారణ అభివ్యక్తీకరణ శైలి అయిలయ్య కవితల్లో దర్శనమిస్తుంది. ఆధునిక జీవితంలోని సంక్లిష్టతను, అనిశ్చితిని, విషాదాన్ని, మృత్యుతత్వాన్ని 'రహస్య చిత్రం' కవితా సంపుటిలో నవీన కవన శైలిలో అయిలయ్య చిత్రించారు. పేర్వారం జగన్నాథం అన్నట్లుగా అయిలయ్య కవిత్వంలో చిత్తశుద్ధితో కూడిన అంతర్మథనం కనిపిస్తుంది. అనతికాలంలోనే ఇలాంటి అధివాస్తవిక ధోరణి నుంచి బయటపడి, దళిత ఆత్మగౌరవ పోరాటపథంలో అయిలయ్య అచ్చమైన దళిత కవిగా రూపాంతరం చెందారు.

> 'నిప్పు కణిక' దళిత దీర్ఘకవితతో వర్తమాన సాహిత్యంలో రవ్వలు రాల్చారు అయిలయ్య. 'ఎవడి హక్కుల పక్కరా ఈ నేల? / ఎవడి కాపలా కుక్కరా ఈ చరిత' అంటూ ఆధిపత్య భావజాలానికి అక్షరాల మంటపెట్టారు. దళితుల చారిత్రక, సాంస్కృతిక విశిష్టతను ఈ దీర్ఘకవితలో ప్రతిభావంతంగా అయిలయ్య దృశ్యమానం చేశారు. 'మా ఉనికి నాగరికత/మా అస్తిత్వం మానవత్వం' అంటూ నాగరికత నిర్మాతలు ముమ్మాటికీ అణగారిన ప్రజలేనని అయిలయ్య తాత్త్విక బంధురంగా నిర్ధారించారు. దళితుల శ్రమ ఔన్నత్యానికి నీరాజనాలు పలికారు. వ్యవసాయ సంస్కృతికి మూల కారకులు దళితులేనని చాటిచెప్పారు.

'శరీరాల్ని యుద్ధభూములుగా, హృదయాల్ని సైనిక శిబిరాలుగా చేసి, ప్రజ్వలించి, దగ్ధమై కాంతిపుంజమై పొమ్మని' నిప్పుకణిక దీర్ఘ కవితతో అయిలయ్య ప్రేరేపిస్తున్నారని మద్దూరి నగేష్‌బాబు ఇచ్చిన కితాబు ఎంతో విలువైనది. కె.దామోదర్‌రావు అనువాదంతో ఆంగ్లంతో పాటు తెలుగులోనూ ఒకేసారి ప్రచురితమైన ఈ 'నిప్పుకణిక' దళిత దీర్ఘ ద్విభాషా కవితను సాహిత్యంలో విలక్షణ ప్రయోగంగా పేర్కొనవచ్చు. కవిగా మంచి గుర్తింపు వస్తున్న తరుణంలో అయిలయ్య విమర్శ, పరిశోధన వైపు దృష్టి సారించారు. అనునిత్యం అధ్యయనం, అధ్యాపనాల్లో మునిగిపోవడం వల్ల, వృత్తిగతమైన, విద్యావిషయకమైన అవసరాలకు అనుగుణంగా చాలామంది ఆచార్యుల్లాగే అయిలయ్య కూడా సాహిత్య విమర్శ దిశగా సాగిపోయారు. 'తెలుగు కవిత అభినవ దృక్పథం', 'సవ్వడి', 'సాహితీ కిరణాలు', 'సాహితీ వాహినీ' వంటి వైవిధ్యమైన వ్యాస సంకలనాలతో విమర్శకునిగా అయిలయ్య సమకాలినుల మన్ననలు అందుకున్నారు.

డా. కోయి కోటేశ్వర రావు
94404 80274

> మలిదశ తెలంగాణ ఉద్యమం తెలుగు భాషా సాహిత్య మూలాలను పునర్నిర్వచించింది. ఉమ్మడి రాష్ట్రంలో ప్రాధాన్యత కోల్పోయిన తెలంగాణ సాహిత్య తీరుతెన్నులను ఈ ప్రాంత రచయితలు ఈనాడు ప్రత్యేకంగా అధ్యయనం చేసి అనేక కొత్త అంశాలను ప్రతిపాదిస్తున్నారు. ఈ బృహత్తర కార్యాచరణలో బన్న అయిలయ్య కూడా గత రెండు దశాబ్దాలుగా తెలంగాణ సాహిత్య విమర్శ వికాసానికి విశేషంగా కృషిచేస్తున్నారు. 'తెలంగాణ సాహిత్య సాంస్కృతిక చైతన్యం', 'తెలంగాణ సాహిత్య సంస్థలు', తెలంగాణ పీఠికలు, 'తెలంగాణ కథ –పరామర్శ' లాంటి విమర్శ గ్రంథాలను ఆయన వెలువరించారు.

తెలుగు కథ కంటే భిన్నంగా తెలంగాణ కథల్లో ప్రతిఫలించిన ప్రాదేశిక లక్షణాలను, భౌగోళిక, చారిత్రక, సాంస్కృతిక స్థితిగతులను పరిశోధనాత్మకంగా విశ్లేషించారు అయిలయ్య. కాలువ మల్లయ్య కథలతో పెనవేసుకున్న తెలంగాణ జీవితాన్ని, ఉద్యమ ప్రభావాన్ని ఆయన ఎంతో దార్శనిక దృష్టితో విశదీకరించారు. తొలిదశ తెలంగాణ ఉద్యమ వెలుగుల్లో ప్రజాకవి కాళోజీ కవిత్వ స్వరూప స్వభావాలను సముచితంగా వివేచించారు. వేర్వేరు కాలాల్లో, రెండు విభిన్నమైన సామాజిక సమస్యల కేంద్రంగా వెలువడిన కన్యాశుల్కం, వరవిక్రయం నాటకాల్లోని రచనా వైవిధ్యాలను సూక్ష్మ పరిశీలనతో పరామర్శించారు. అయిలయ్య వందకిపైగా పరిశోధనా వ్యాసాలకు సారథ్యం వహించారు. మట్టిలో మాణిక్యాలను వెలికితీసి కవులుగా, రచయితలుగా తీర్చిదిద్దారు. పరిశోధకునిగా మాత్రమే కాకుండా సంపాదకుడిగా కూడా అయిలయ్య కృషి చేశారు. తెలుగు సాహిత్య పరిశోధనకు, విమర్శకు ఉపయోగపడే పలు గ్రంథాలను, సంకలనాలను తన సంపాదకత్వంలో ప్రచురించారు. పాఠశాల నుంచి కళాశాల స్థాయి వరకు తెలంగాణ సోయితో తెలుగు పాఠ్యగ్రంథాలను రూపొందించడంలో ఆయా పుస్తకాలకు సంపాదకుడిగా అయిలయ్య అత్యంత కీలకపాత్ర పోషించారు. చేపట్టిన సాహిత్య కార్యక్రమాలను అంకితభావంతో పూర్తిచేసిన నిత్య సాహిత్య చైతన్య స్ఫూర్తి ఆచార్య బన్న అయిలయ్య.

(ఈ నెల 28న వరంగల్ కాకతీయ విశ్వ విద్యాలయంలో జరగనున్న ఆచార్య బన్న అయిలయ్య సాహిత్య సమాలోచన సందర్భంగా)

(వ్యాసకర్త: ప్రభుత్వ సిటీ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షులు)

భూమి కావాలి

భూమి కావాలి
చక్కగా దున్ని
పుడమికి హరిత వర్ణం పులమడానికి
కొంచెం భూమి కావాలి

నారెట్ల పోస్తారో
నీరెట్ల కడతారో
కలుపెట్లా తీస్తారో
పంటెట్ల కోస్తారో
ముందు తరాలకు చూపడానికి
కొంచెం భూమి కావాలి

చినుకు తడికి
మట్టి ఎలా పరిమళిస్తుందో
చెమట తడికి
పుడమి ఎలా పులకరిస్తుందో
ప్రత్యక్షంగా చూపడానికి
కొంచెం భూమి కావాలి

తన గొంతు తడిస్తేనే
మన కడుపు నిండుతుందని
తను బీడుబారితే
మనం మోడుబారుతామని
తను నిలిస్తేనే
మనం గెలుస్తామని నిరూపించడానికి
కొంచెం భూమి కావాలి

వ్యాపార వస్తువును చేసి
తనను అమ్మినా
తనెప్పుడూ అమ్మ ప్రేమ చూపుతుందని
ప్లాట్లు మొలిచే భూమిపై
పంటలు కూడా పండుతాయని
నవతరానికి చూపెట్టడానికి
కొంచెం భూమి కావాలి!

ఎన్.నరేశ్ చారి
97013 34516

ఉన్ని గొర్లు

ఒకరి చేనుకు ఒకరు బదులుపోయి
నాట్లు వేయడం కలుపు తీయడం
చేస్తున్నట్లే
ఓ మంద అయ్యాక ఇంకో మంద
నీళ్లేసి సపారంలోనో చెట్లనీడలోనో
గొర్లు కత్తిరిస్తుండ్రి

అరుగుల మీద బంకులల్ల
చింతబోటు వలిచి ఎండబెట్టినట్లుగా
నల్ల ఉన్ని కసుర ఉన్ని తెల్ల ఉన్ని
ఒకదానికొకటి వేరుచేసి ఎండబెట్టేది
వడికిన ఉన్ని కండెలను ప్యాక కట్టలకు
చుట్టి మగ్గానికి పంపేది

పొద్దున్నే దూడలకు పాలు సేపిన
ఆవు గేదెల వలే
మందకాడ పిల్లలకు పాలుసేపి
గొర్లొల్లకు కాసిన్ని పాలిచ్చేవి ఉన్ని గొర్లు
ఏడాదికి ఉత్తరాయణం దక్షిణాయణం
అన్నట్లుగా
మొక్కార్తిలో ఓసారి శివరాత్రి
ముందోసారి
ఊరంతా గొర్ల కత్తిరింపులు
సాయంత్రానికి నోరూరించే గుగ్గిళ్ల
రుచులు

చింతబిచ్చల సరంబలితో పడుగు
పూత పూసి
కుంచె దబ్బలతో సవాలలు అల్లితే
గిజగాడు గూడు అల్లడానికి గురువులు
గొర్లొల్లు అయినట్లుండేది
కులవృత్తులు కనుమరుగవుతున్నట్లే
కులాలకు ఆనవాళ్లయిన పదాలు
కనుమరుగవుతున్నాయి

వ్యాపారులు బాయిలర్ కోళ్లను
పెంచుతున్నట్లు
గొర్లొల్లు బండగొర్లను పెంచుతున్నారు
అంతరించిపోతున్న జీవరాసుల్లో
ఉన్ని గొర్లు చేరిపోయాయి
గొంగళ్లకు సర్వనామాలై స్వెట్టర్లు
వచ్చాయి
ఉపాధి కల్పించే ఉన్ని గొర్లకు
పర్యాయపదాలై బండగొర్లొచ్చాయి!

ఎజ్జు మల్లయ్య
91006 10501

అపురూప గీతాల పూలతోట

> హమ్ నే దేఖీ హై ఉన్ ఆంఖోంకి మహకతీ ఖుష్‌బూ
> హాథ్ సే ఛూకె ఇసే రిష్తోంకా ఇల్జామ్ న దో
> సిర్ఫ్ ఎహసాస్ హై యె రూహ్ సె మహసూస్ కరో
> ప్యార్ కో ప్యార్ హీ రహనే దో కొయీ నామ్ న దో
>
> - 'ఖామోషీ' చిత్రంలో గుల్జార్ రాసిన పాట ఇది

(నేను ఆ కండ్లల్లో గుబాళిస్తున్న సుగంధాన్ని చూశాను..
దానిని చేతులతో తాకి బంధాల దోషాన్ని అంటగట్టవద్దు..
ఇదొక అనుభూతి, ఆత్మతో ఆస్వాదించండి..
ప్రేమను ప్రేమగానే ఉండనివ్వండి.. దానికి ఏదో ఒక పేరు పెట్టవద్దు)

గుల్జార్ అంటే అందరికీ హిందీ సినిమాల గేయ రచయితగా, దర్శకునిగా మాత్రమే తెలుసు. కానీ, ఆయన ఉర్దూ, హిందీలో అద్భుతమైన కవిత్వాన్ని రాసిన భావుక కవి. సినీకవిగా, దర్శకునిగా పేరుగాంచినా కవితాయానమే ఆయనకు ఇష్టం. జ్ఞానపీఠ్ వచ్చిందని తెలిసిన తర్వాత గుల్జార్ స్పందన కూడా దీనినే తెలియజేస్తున్నది. 'సినీకవిగా గుర్తించారు కానీ, నా కవిత్వాన్ని కాదు కదా' అనుకునేవారట ఇన్నాళ్లూ. కానీ, ఇప్పుడు జ్ఞానపీఠ్ ఇవ్వడంతో ఉర్దూ కవిత్వం, షాయరీలపై జనం ఆసక్తిగానే ఉన్నారని తెలిసి ఎంతో సంతోషం కలిగిందట ఆయనకు. గుల్జార్‌కు ఉర్దూ కవిత్వమంటే అంత ఇష్టం. సాహిత్యంలో శిఖరాల మీద నుంచి సినిమా గేయరచనా వ్యాసంగంలోకి దూకినవాడు గుల్జార్.. మన శ్రీశ్రీ, కృష్ణశాస్త్రిలాగా. ఆ ఇద్దరి శైలుల మిశ్రమంలా ఉంటుంది ఆయన పాట. సున్నితమైన భావాలను లలిత లలితమైన పదాలతో, కవితామాధురీ మకరందాలతో ఏర్చికూర్చిన కవి, గేయ రచయిత గుల్జార్.

సంపూరణ్‌సింగ్ కాల్రా ఎవరో ఎవరికీ తెలియదు. కానీ, గుల్జార్ అనగానే టక్కున ఏదో ఒక పాట గుర్తుకువస్తుంది కొద్దోగొప్పో హిందీ సినిమాలు చూసే తెలుగువాళ్లకు. సంపూరణ్‌సింగ్ దెబ్బతిన్న కార్లకు డెంటింగ్ చేసిన తర్వాత రంగులద్దేవాడు. ఆ రంగులు భావుకుడైన కవిలో ఏవేవో అక్షరాల అల్లికలకు దారితీసేవి. తండ్రి ఠాట్ 'ఇదేమిటి బతుకుదెరువు చూసుకోమంటే ఈ కవితలేంటి' అని గర్జిస్తే గుల్జార్ దీన్వీ వెనుక దాక్కున్నాడీ కవి. ఏతావాతా గుల్జార్ గానే స్థిరపడ్డాడు. గుల్జార్ అంటే ఉర్దూలో పూలతోట అని అర్థం. ఈ తోటలో బాల్యం గంతులు వేస్తుంది. యవ్వనం గొంతు సవరించుకుంటుంది. జీవితం తననుతాను అద్దంలో చూసుకుని మురిసిపోతుంది, ముడుచుకుపోతుంది. పన్నీరవుతుంది. కన్నీరు పెడుతుంది. అన్ని రుతువులూ వస్తూపోతూ దాగుడుమూతలాడే ఈ తోటలో విరబూసిన పాటలెన్నో. అన్నీ సుమ కోమలమైనవే, ద్రుమ శ్యామలమైనవే. కర్కశ జీవన వాస్తవికత ముందు ఓ నిట్టూర్పు ఆయన అక్షరం. సుతిమెత్తని హృదయ స్పందనల ఆవిష్కారం.

ఓవైపు పనిచేసుకుంటూ, మరోవైపు చదువుకుంటూ అంచెలంచెలుగా కవిగా గుర్తింపు తెచ్చుకొని, చివరకు ఆ కాలపు కళా సాంస్కృతిక రంగ మేధావులందరిలాగే ప్రొగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్‌లో చేరిపోయారు గుల్జార్. ఉర్దూ, పంజాబీలో ఎక్కువగా రాశారాయన. హిందీ మాండలికాలైన బ్రజ్ భాషా, ఖడీబోలీ, హర్యాణ్వీ, మార్వాడీలోనూ రచనలు చేసిన పాలీగ్లాట్ గుల్జార్. హిందీలో 'త్రివేణి'గా సుప్రసిద్ధమైన ఛందస్సులో కవితలల్లారు. 'చాంద్ పుఖ్‌రాజ్ కా', 'రాత్ పశ్మినేకీ', 'పంద్రా పాంచ్ పచ్చత్తర్' అనే మూడు సంపుటాల్లో తన కవితలు వెలువరించారు. 'రావీ పార్' అనే కథల సంకలనం కూడా వెలువడింది. ఈ సాహిత్య జీవి కోసం సినిమా ఎదురుచూస్తున్నది. శైలేంద్ర ప్రోత్సాహంతో అటుగా అడుగులు కూడా పడ్డాయి. సినిమాకు సాహితీ సుగంధాలద్దిన బిమల్ రాయ్ సినిమా 'బందినీ'తో గుల్జార్ పాట మొట్టమొదటిసారిగా తెరకెక్కింది. 'మొర గోర అంగ్ లయిలే..' అనే పల్లవితో కూడిన ఆ పాటను ఎస్డీ బర్మన్ స్వరాలలో లత గానం చేశారు. ఆ పాటతో మొదలైన సినీ ప్రయాణం కాలక్రమంలో రసప్రవాహమైంది. ఆ ప్రవాహంలో మనకు దొరికిన ఆణిముత్యాలెన్నో. అందులో మంచివి ఏరడమంటే పెద్ద పనే. 'తేరే బినా జిందగీ సే కోయీ శికవా నహీ' (ఆంధీ), 'ఆనేవాలా పల్ జానేవాలా హై' (గోల్‌మాల్), 'తుఝ్ సే నారాజ్ నహీ జిందగీ' (మాసూమ్), 'మైనె తెరేలియే హీ సాత్ రంగ్‌కే సప్నే చునే' (ఆనంద్), 'ముసాఫిర్ హూ యారో' (పరిచయ్), 'నామ్ గుమ్ జాయెగా' (కినారా) వంటివి వాటిలో మచ్చుకు కొన్ని. 'రుదాలీ'ని ఏడిపించాలంటే 'దిల్ హుం హుం' అనాల్సిందే. భూపేన్ హజారికా దిగిరావాల్సిందే. స్వరాలు కూర్చి పాడాల్సిందే. భూపిందర్ విలక్షణ స్వరం 'దిల్ ఢూండ్ తా హై' అని 'మౌసం'లో కలవరపడాలన్నా గుల్జార్ కలం ఝుళిపించాల్సిందే. 'ఘరౌందా' కోసం 'దో దివానే షహర్ మే' తిరుగుతూ అన్వేషణానంద విషాదాల్లో మునిగి తేలాలన్నా గుల్జార్ అక్షరాల అండదండలు లేకుండా సాధ్యపడదు. 'కాబూలీవాలా' ఆనందాశ్చర్యాలతో 'గంగా ఆయి కహాసే' అని గొణుక్కోవాలన్నా, 'మాసూమ్' పిల్లలు 'లకడి కే కాఠీ, కాఠి కే గోడా' మీద దౌడు తీయాలన్నా గుల్జార్ అక్షరాలు గుర్రమాట ఆడాల్సిందే. అంతెందుకు రెహ్మాన్‌కు 'జయహో' అంటూ 'ఆస్కార్'మిచ్చిందీ తనే. తోడుగా అందుకున్నదీ తనే.

కవితాత్మకమైన పాటలే కాదు, ఎన్నెన్నో మంచిమంచి సినిమాలకు మాటలూ అందించారు గుల్జార్. దర్శకుడిగా ఆణిముత్యాల్లాంటి సినిమాలూ తీశారు. 'కోశిష్', 'ఆంధీ', 'నమ్‌కీన్', 'అంగూర్', 'పరిచయ్', 'ఖుష్బూ', 'కినారా', 'అచానక్', 'లెకిన్' వాటిలో మచ్చుకు కొన్ని. ఇక మీరా అదో చరిత్ర. హేమామాలిని మీరాగా నటిస్తే మీరా భజనలన్నీ దక్షిణాది గాయని వాణీ జయరాం పాడటం విశేషం. లత పాడాలనుకుని పాడలేకపోయిన పాటలవి. స్వరాలు సమకూర్చింది సితార్ మేస్ట్రో పండిట్ రవిశంకర్.

తుమ్మలపల్లి రఘురాములు
91827 77750

> గుల్జార్ అందుకున్న అవార్డులకు ఓ విశేషముంది. జాతీయ ఉత్తమ గేయ రచయిత నుంచి ఆస్కార్ దాకా ఉన్న అవార్డులన్నీ ఆయనకు దక్కాయి. అన్నిటికి మించి సినిమా రంగంలో అత్యున్నత పురస్కారమైన దాదాసాహెబ్ ఫాల్కేను ఆయన ఎప్పుడో అందుకున్నారు. ఇప్పుడు జ్ఞానపీఠ్ వరించింది. ఈ రెండూ అందుకున్న వ్యక్తులు ఎవరూ లేరు. ఇక 'స్లమ్‌డాగ్ మిలియనీర్' సినిమాకు 'జయహో' పాటతో బెస్ట్ ఒరిజినల్ సాంగ్ క్యాటగిరీలో అందుకున్న ఆస్కార్‌నూ దీనికి కలిపితే ఇది అసాధ్యమైన కలయికే. ఆయన సృజనాత్మక అక్షరయానంలో ఇదొక 'త్రివేణి' సంగమం.

సమ్మక్క- సారలమ్మ

సీ: తెలంగాణ పోరాటములలోని తొలికాంతి
కిరణాల కొంగొత్త కెరటమీవు
మూలవాసుల గుండె మూలలో గుడికట్టి
వమ్ము కాలేని దైవమ్ము నీవు
తమ్ముల నాల్గు పాదమ్ముల ధమ్మాన
పాలించు కడు దక్షురాలవీవు
ఆత్మ గౌరవమునకై రౌరవము జేసి
బట్టు కొట్లాడిన బడ్డవీవు

తే.గీ: తెగని రక్షింపగా యెడతెగని పోరు
బాటపట్టిన ముద్దుల పట్టివీవు
పట్టుదలలోని శక్తికి పట్టుగొమ్మ
వడివి కడుపులో జెలగు సందడివి నీవు

తే.గీ: రాచరికము దండంబెత్తి ప్రజల మీద
పెత్తనము చేయు కాలాన నెత్తుకొంటి
వమ్మ జనులకై నెత్తుటుద్యమ పతాక
అందుకే గద వారికత్యంత భక్తి

ఉ: పక్క జనాల కోసరమెవండు సరమ్ములు పేని
ప్రేమతో
చక్కనలంకరించునొ నిజానికతండె వరించు
మించున
ల్దిక్కుల కీర్తి చంద్రికలు దిక్కుగమారునతండె తల్లి స
మ్మక్క విధాన నంచవని నందరు నిన్ను నుతింతు
రెప్పుడున్

క: నువ్వాడిన ఆటలు నీ
నవ్వులలో పరిమళించు నవ సూనమ్ముల్
జివ్వుమని దూయు బాణము
లవ్వా! ధ్వనియించు నేడునడవి గడపలో!

ఆ.వె: ప్రజల మేలు కొరకు పలితపించెడు వారె
కొలువు దీర గలరు గుండె గుడుల
ఎన్ని యుగములైన ఇగిరిపోజాలదు
వారి కీర్తి జలధి వసుధ మీద

తోకల రాజేశం
96767 61415

ఆహ్వానం

కొలకలూరి పురస్కారాల ప్రదానోత్సవం

హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో (ఎన్టీఆర్ కళాప్రాంగణం) ఈనెల 26న సాయంత్రం 6 గంటలకు కొలకలూరి పురస్కారాల ప్రదానోత్సవం జరుగనున్నది. ఈ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరవుతారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య టి.కిషన్‌రావు విశిష్ట అతిథిగా, కావలిలోని వీఎస్ యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య చిలుమూరి శ్రీనివాసరావు గౌరవ అతిథిగా, తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ ఆంగ్ల శాఖాధ్యక్షులు ఆచార్య కొలకలూరి సుమకిరణ్ ప్రత్యేక అతిథిగా పాల్గొంటారు. కుప్పంలోని ద్రావిడ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య కొలకలూరి మధుజ్యోతి అధ్యక్షత వహిస్తారు.

ఈ కార్యక్రమంలో పలు విభాగాల్లో పురస్కారాలు అందజేస్తారు. కొలకలూరి భాగీరథీ కథా నిక పురస్కారానికి హుమయూన్ సంఘీర్ రచించిన 'కామునికంత', కేవీ మేఘనాథరెడ్డి రచించిన 'కలుంకూరి గుట్ట' ఎంపికయ్యాయి. కొలకలూరి విశ్రాంతమ్మ నవలా పురస్కారానికి డా.దిలావర్ రచించిన 'అడవి బతుకులు', సింహప్రసాద్ రచించిన 'నిర్మాల్యం' ఎంపికయ్యాయి. కొలకలూరి రామయ్య విమర్శన పురస్కారానికి డా.సుంకిరెడ్డి నారాయణరెడ్డి రచించిన 'తాత్విక నేపథ్యంలో తెలుగు కవిత్వ పరిణామం', వి.రాజా రామమోహనరావు రచించిన 'నవలా హృదయం' ఎంపికయ్యాయి. దీంతో పాటు 'ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహిత్యం: సామాజిక విశ్లేషణ'పై పరిశోధనలు చేసిన డా.గడ్డం తిరుపతమ్మ, 'ఆచార్య కొలకలూరి నవలా సాహిత్యం: మానవతా దృక్పథం'పై పీహెచ్‌డీ చేసిన డా.దుగులూరి సురేఖను సన్మానిస్తారు. ఈ మేరకు ఆచార్యులు కె.ఆశాజ్యోతి జనార్దనం, కె.అనితా శ్రీకిరణ్ తెలిపారు.